నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | ఆదివారం 22 జూన్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## ఎమ్మెల్యే ప్రకటన తర్వాత జిల్లాలో జరిగిన దాడులు

- సెప్టెంబర్ 23న బైపాస్ రోడ్డులో (ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడిగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకుడి)కి చెందిన బ్యాచ్ యువకులు, జిల్లా కేంద్రానికి చెందిన మరో ఇద్దరు యువకులు పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. దాడికి వచ్చిన ఇద్దరు యువకులకు తీవ్రగాయాల పాలై సీరియస్ కండిషన్‌లో హాస్పిటల్‌లో చేరారు.
- ఈ ఏడాది జనవరి 15న బీజేపీ నాయకుడు మెట్టుపల్లి జయ రామరావుపై బైపాస్ రోడ్డులోని మటన్ అండ్ షిప్ మార్కెట్‌లో దాడి జరిగింది. బైపాస్ రోడ్డులో ఉండే సదరు కాంగ్రెస్ నాయకుడికి చెందిన బ్యాచ్‌లోని వ్యక్తులే తనపై దాడి చేశారంటూ బాధితుడు చెప్పారు.
- మార్చి 9న రాత్రి తిలక్‌నగర్ శివాజీ గౌండ్‌లో ఎర్రగుంటపల్లి సంపత్‌పై దాడి జరిగింది. సంపత్‌ను తీవ్రంగా కొడుతూ.. పీకపై కాలేసి తొక్కుతూ.. అన్న చంపేయ్ అన్న వాడిని అంటూ దాడి చేస్తున్న వారు మాట్లాడిన వీడియో సైతం బయటికి వచ్చింది.
- మార్చి 27న నస్పూర్ సమీపంలోని ఎలైట్ బార్‌లో రెండు వర్గాల యువకులు పరస్పరం దాడి చేసుకున్నారు. మొదట ఓ బ్యాచ్ తాగిన మైకంలో తమ టేబుల్ దగ్గరకి వచ్చిన వ్యక్తితో వాగ్వాదానికి దిగి బీరుసీసాతో తల పగులగొట్టారు. అనంతరం ఆ వ్యక్తి స్నేహితులను పిలిపించడంతో పెద్ద ఎత్తున గొడవ జరిగింది.
- మార్చి 28న అర్ధరాత్రి మంచిర్యాల బస్టాండ్ సమీపంలోని డైమండ్ పాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో హమాలీవాడకు చెందిన ముగ్గురు యువకులు, ఓ టీస్టాల్ నిర్వాహకుడితో గొడవపడి ఆ నిర్వాహకుడిపై దాడి చేశారు. భారీగా రెండు వర్గాల యువకులు అక్కడ మోహరించారు. ఇదే సమయంలో ఘటనా స్థలానికి బైపాస్ రోడ్డు బ్యాచ్ సైతం వచ్చిందని, కానీ సమయానికి పోలీసులు రావడంతో యువకులంతా చెదిరిపోయారు. గొడవకు కారకులైన నలుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
- ఐదారు నెలల క్రితం మంచిర్యాల అరేబియన్ మండీ సమపంలోని ఓ బిల్డింగ్‌లో పేకాట ఆడుతూ కొందరు గొడవ పడ్డారు. బూతులు తిట్టుకోవడంతో ఓ వ్యక్తి సైట్ బ్యాచ్‌ను పిలిపించి మరో వ్యక్తిపై తీవ్రంగా దాడి చేశారు.
- ఇక ఎమ్మెల్యే ప్రకటన చేసిన నెలలోనే సెప్టెంబర్ 17న ఐబీ చౌరస్తాలోని మా విందు హోటల్‌లో మొన్నటి ఘటనలో దాడికి గురైన దగ్గుల మధుపై ఇదే సైట్ బ్యాచ్ దాడి చేసింది. ఈ ఘటనలో గాయపడిన అతన్ని తీవ్రంగా బెదిరించడంతో కేసు పెట్టడానికి వెనకాడారు. అదే మధుపై మరోసారి గురువారం రాత్రి అదే సైట్ బ్యాచ్ దాడి చేసింది. తప్పించుకోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు.


సెప్టెంబర్ 17న 'మా విందు హోటల్'లో బీఆర్ఎస్వీ లీడర్‌పై దాడి చేస్తున్న బ్యాచ్

తిలక్‌నగర్ శివాజీ గ్రౌండ్‌లో ఎర్రగుంటపల్లి సంపత్ పీకపై కాలుపెట్టి తొక్కుతున్న సైట్ బ్యాచ్(ఫైల్)

దగ్గుల మధు చికిత్స పొందుతున్న హాస్పిటల్ ముందు నుంచి గురువారం రాత్రి 12.30 గంటలకు సైరన్ వేసుకొని చక్కర్లు కొడుతున్న సుర్మిళ్ల వేణు వాహనం


దాడిలో గాయపడిన దగ్గుల మధు

# గ్యాంగ్ వార్స్

## మంచిర్యాల జిల్లా కేంద్రంలో మళ్లీ మొదలైన దాడులు
## ప్రజల్లో భయాందోళనలు

- కొత్త సీపీ వచ్చాక పరిస్థితి మారుతుందని హామీ ఇచ్చిన పోలీసులు
- తాజాగా బీఆర్ఎస్వీ నాయకుడిపై దాడితో పోయిన నమ్మకం
- గతంలోలాగే ఈ దాడి జరిగింది కూడా బైపాస్ రోడ్డులోనే..
- అప్పటిలాగే. ఇప్పుడూ దెబ్బలు తగిలిన వ్యక్తిపైనే ఉల్టా కేసు
- ఖాకీల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

మంచిర్యాల, జూన్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా కేంద్రంలో గ్యాంగ్ వార్స్ అలజడి మళ్లీ మొదలైంది. గతంలో వరుస దాడులు కలకలం రేపగా, ప్రస్తుతం అదే పరిస్థితి పునరావృతం కావడం ఇక్కడి ప్రజలను భయ భ్రాంతులకు గురిచేస్తున్నది. మంచి మంచిర్యాలగా పేరున్న నగరంలో ఎప్పుడు ఎవరిపై దాడి జరుగుతుందోనని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల లీడర్లు, సామాజిక కార్యకర్తలు వణికిపోవడం పరిపాటిగా మారుతున్నది. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు గతేడాది సెప్టెబర్ 23న ప్రెస్‌మీట్ పెట్టి మరీ మంచిర్యాలలో రౌడీయిజం, గూండాయిజం ఉండనివ్వమంటూ స్పష్టం చేశారు. కానీ, ఆయన ప్రకటన చేసిన రోజే అర్ధరాత్రి మంచిర్యాల బైపాస్ రోడ్డులో రెండు వర్గాల యువకులు కత్తులు, రాడ్‌లతో పరస్పర దాడులు చేసుకోవడం కలకలం సృష్టించింది. ఎమ్మెల్యే చెప్పిన వినకుండా ఆయన అనుచరుడికి చెందిన బ్యాచ్ నిత్యం దాడులకు పాల్పడడం, ఎవరినో ఒకరిని కొట్టి వార్తల్లో నిలవడం.. కొట్టినోళ్లను పక్కనపెట్టి, దెబ్బలు తిన్నోళ్ల మీదే ఉల్టా కేసులు అవ్వడం.. నిత్య కృత్యంగా మారిపోయింది. ఇలా మంచిర్యాలలో వరుస దాడుల నేపథ్యంలో రామగుండ సీపీ అంబర్ కిషోర్ ఝూ ఈ ఏడాది మార్చిలో బాధ్యతలు చేపట్టారు. ఆయన బాధ్యతలు తీసుకోడానికి ముందు రోజే మంచిర్యాలలో ఎర్రగుంటపల్లి సంపత్ అనే వ్యక్తిపై సైట్ బ్యాచ్ దాడి చేసింది. ఈ నేపథ్యంలో మంచిర్యాలలో ఇకపై దాడులు జరగవని, పరిస్థితి మారుతుందంటూ పోలీసులు హామీ ఇచ్చారు. అలా హామీ ఇచ్చి రెండు.. మూడు నెలలైనా గడవకముందే బీఆర్ఎస్ విద్యార్థి నాయకుడు దగ్గుల మధుపై దాడి జరగడం.. అది కూడా బైపాస్ రోడ్డులోని సైట్ ఏరియాలోనే చోటుచేసుకోవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

### పోలీసులు తీరుపై విమర్శలు..

రామగుండం కొత్త సీపీగా అంబర్ కిషోర్ ఝూ వచ్చాక.. ఏప్రిల్ 1న తిలక్‌నగర్ నాకా బంధి ప్రోగ్రామ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంచిర్యాల డీసీపీ, ఏసీపీ మీడియాతో ఆఫ్ ది రికార్డులో మాట్లాడుతూ.. ఇక నుంచి మార్పు ఉంటుంది. దాడులు జరగవు. మీరే చూస్తారంటూ చెప్పారు. కానీ ఇలా చెప్పిన ఒకటీ, రెండు రోజులకే మంచిర్యాల శ్రీనివాస గార్డెన్ సమీపంలో ఓ బ్యాచ్ వార్ జరిగింది. ఆ ఘటన అనంతరం ఆరుగురు యువకులను అరెస్టు చేసి జైలుకు పంపించినట్లు పోలీసులు చెబుతున్నారు. అప్పటి నుంచి మంచిర్యాలలో గొడవలు, దాడులు తగ్గుముఖం పట్టాయి. ఇక అంతా ప్రశాంతం అనుకుంటున్న సమయంలో మంచిర్యాలలో కొందరు యువకులు బుధవారం రాత్రి ఓ స్కూల్ వ్యాన్ డ్రైవర్‌పై నలుగురు యువకులు దాడి చేశారు. తాగిన మైకంలో జరిగిందంటూ కేసు నమోదు చేశారు. అది జరిగిన మరుసటి రోజే బీఆర్ఎస్వీ నాయకుడు దగ్గుల మధుపై దాడి జరిగింది. సైట్ ప్రాంతంలోనే ఈ దాడి జరగడం, నస్పూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు ఇందులో కీలకంగా వ్యవహరించారంటూ బాధితుడు చెప్పడం జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. పోలీసులు హామీ ఇచ్చాక కూడా ఇలా దాడులు జరుగుతుండడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

### దాడి చేసి రెచ్చగొట్టి..

గురువారం రాత్రి సైట్ బ్యాచ్ చేసిన దాడిలో తీవ్రంగా గాయపడిన దగ్గుల మధు ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. మధును తీసుకెళ్లి, దాడి చేయించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న సుర్మిళ్ల వేణు తన నల్లరంగు స్కార్పియో వాహనంలో సైరన్ వేసుకొని హాస్పిటల్ ముందు నుంచి బైపాస్ రోడ్డు వరకు చక్కర్లు కొట్టారు. ఇందుకు సంబంధించిన వీడియోలను బీఆర్ఎస్ నాయకులు విడుదల చేశారు. దాడి చేయడంతో పాటు చికిత్స పొందుతున్న దగ్గర బీఆర్ఎస్ నాయకులు ఉన్నారని తెలిసి కూడా సైరన్ వేసుకొని కారులో చక్కర్లు కొట్టడం.. ఎవరిని రెచ్చగొట్టేందుకు చేశారని.. ఇంత జరుగుతుంటే పోలీసులు పట్టించుకోలేదని అంటున్నారు. ఇలా వెహికిల్‌లో సైరన్ వేసుకొని చక్కర్లు కొడుతున్న సమయంలో ఇద్దరు కానిస్టేబుళ్లు సైతం హాస్పిటల్ దగ్గరే గస్తీ కాస్తున్నారని బీఆర్ఎస్ లీడర్లు చెబుతున్నారు. దాడి చేసిన వ్యక్తులు ఇలా వాహనం వేసుకొని తిరుగుతుంటే పోలీసులు చోద్యం చూడడం, దాడికి కారకులైన వారిని అదుపులోకి తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పైగా దాడిలో తీవ్రంగా గాయపడిన మధుపైనే ఐదు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. గతంలోనూ పలు గొడవల్లో పోలీసులు దాడిలో గాయపడిన వారిపైనే కేసులు నమోదు చేయడంతో విచారణలో అలసత్వం ప్రదర్శించారంటూ బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు.

## ఎనిమిది మంది అరెస్ట్

మంచిర్యాల అర్బన్, జూన్ 21 : ఈ నెల 19న రాత్రి మంచిర్యాల బైపాస్ రోడ్డులో జరిగిన దాడి కేసులో ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్ రావు శనివారం తెలిపారు. ఈ దాడిలో గాయాలైన బీఆర్ఎస్వీ నాయకుడు దగ్గుల మధుకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశామన్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఈ నెల 19న ఇద్దరు స్నేహితులైన సుర్మిళ్ల వేణు, దగ్గుల మధుకుమార్ అడ్మిషన్ విషయంపై కాలేజీ రోడ్‌లో గల శ్రీ చైతన్య స్కూల్ వద్ద కలిశారు. అనంతరం సుర్మిళ్ల వేణు, పాదం కుమార్, అరికె రాజేశ్, గుర్రాల వంశీ దగ్గుల మధుతో కలిసి కలెక్టరేట్ ఏరియాలో మద్యం సేవించారు. తర్వాత సుర్మిళ్ల వేణుకి శ్రీరాంపూర్ సింగరేణి జీఎం ఆఫీసులో పని ఉండడంతో అందరూ కలిసి అక్కడికి వెళ్లారు. పని ముగించుకున్న తర్వాత తాళ్లపెల్లి దగ్గర గోదావరి ఏరియాలో మద్యం సేవించారు. ఈ క్రమంలో సుర్మిళ్ల వేణు మంచిర్యాల బైపాస్ రోడ్డులో గల జగన్మోహన్ రావు ఇంటికి వెళ్తున్నామని దగ్గుల మధుకుమార్‌తో అనగా.. నేను కూడా వస్తానని చెప్పాడు. అందరూ కలిసి స్కార్పియో వాహనంలో రాత్రి 8 గంటల ప్రాంతంలో అక్కడికి వెళ్లారు. దగ్గుల మధు కుమార్, పాదం కుమార్, అరికే రాకేశ్, గుర్రాల వంశీ వాహనములోనే ఉండగా సుర్మిళ్ల వేణు మాత్రం ఇంటిలోపలికి వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత దగ్గుల మధు వాహనం దిగి ఫోన్ మాట్లాడుతుండగా.. అక్కడే ఉన్న ఎల్కపల్లి వినయ్ ''నీకు ఇక్కడ ఏం పని.. నీకు.. మాకు పాత పగలున్నవి.. ఇక్కడికి ఎందుకు వచ్చినవు' అని ప్రశ్నించాడు. ఇందుకు మద్యం మత్తులో ఉన్న దగ్గుల మధు.. ఇదేమైనా మీ అడ్డానా, లేక నిషేధిత ప్రాంతమా అని అన్నాడు. దీంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి కొట్టుకుటుండగా.. అక్కడే ఉన్న ఆత్మకూరి సంజీవ్, టీటీ సాయి తేజ , బెల్లంకొండ్ రాకేశ్.. వినయ్‌తో కలిసి దగ్గుల మధుకుమార్‌పై దాడి చేశారు. ఇదే సమయంలో వినయ్ రాయితో మధుకర్‌ను కొట్టగా.. మధుకర్ తల వెనుక గాయమైనట్లు వివరించారు. ఈ ఘటనలో ఆత్మకూరి సంజీవ్, డీటీ సాయి తేజ, బెల్లంకొండ రాకేశ్, ఎల్కపల్లి వినయ్, సుర్మిళ్ల వేణు, పాదం కుమార్, అరికే రాకేశ్, గుర్రాల వంశీని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా, దగ్గుల మధుకుమార్ తనను కొట్టినట్లు ఈ నెల 20న వినయ్ ఫిర్యాదు ఇచ్చాడు. దీంతో దగ్గుల మధుకుమార్‌పైనా కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

## సారూ.. మా రూట్లో బస్సు నడపండి

### అమాత్యుని నియోజకవర్గంలో ఆర్టీసీ అధికారులకు కాంగ్రెస్ నాయకుల వినతి


జనగామ రూట్‌లో బస్సు నడపాలని ఆర్టీసీ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న సిర్సా గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు

కోటపల్లి, జూన్ 21 : 'సారూ... మా రూట్‌లో బస్సు సౌకర్యం లేక 10 గ్రామాల ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మాపై దయచూపి బస్సు నడిపించండి' అంటూ రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ ప్రాతినిధ్యం వహిస్తున్న చెన్నూర్ నియోజకవర్గంలోని సిర్సా గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు చెన్నూర్ బస్టాండ్‌లో ఆర్టీసీ అధికారులకు వినతి పత్రం అందించారు. ఇటీవల జనగామ రూట్‌లో ఆర్టీసీ బస్సు సేవలు నిలిపివేయడంతో పారుపల్లి, లింగన్నపేట, ఎదుల్లబంధం, సిర్సా, పుల్లగామ, రొయ్యలపల్లి, ఆలుగామ, జనగామ, సూపాక, నందరాంపల్లి గ్రామాల ప్రజలు, విద్యార్థులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఎక్కువ చార్జీలు చెల్లించి ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించాల్సి వస్తుందని, ఇకనైనా అధికారులు చొరవ చూపాలని కోరారు.

### మంత్రి అయ్యాకే బస్సు రద్దు

గడ్డం వివేక్ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత జనగామ రూట్‌లో బస్సు రద్దు కావడం స్థానికంగా చర్చనీయాంశమవుతోంది. గతంలో ఇదే రూట్‌లో బస్సులు బంద్ కాగా.. 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనాలకు స్పందించి బస్సును తిరిగి నడిపించారు. తాజాగా మళ్లీ ఇదే రూట్‌లో బస్సును రద్దు చేయడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే చెన్నూర్ నుంచి సిరొంచ-కాళేశ్వరం రూట్‌లో నడిచే బస్సుల సంఖ్యను తగ్గించడంతో పాటు పల్లె వెలుగు బస్సులకు ఎక్స్‌ప్రెస్ బోర్డులను పెట్టి నడిపిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ఆపకపోవడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

- రూ. ఏడెనిమిది కోట్లు అప్పు చేసి రాత్రికి రాత్రే ఉడాయించిన వైనం
- ప్రైవేట్ వ్యక్తి చేతిలో విద్యార్థుల సర్టిఫికెట్లు
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు

## రూ.కోట్లల్లో టోకరా..!

### జూనియర్ కళాశాల నిర్వాహకుడి మోసం


పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాధితులు

మంచిర్యాల అర్బన్, జూన్ 21 : మంచిర్యాల పట్టణంలోని ప్రతిభ జూనియర్ కళాశాల నిర్వాహకుడు మహేందర్ రూ.కోట్లలో అప్పులు చేసి కళాశాల, కళాశాల భవనాన్ని అమ్ముకొని ఉడాయించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు అతడికి అప్పులు ఇచ్చిన వారంతా శనివారం మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ప్రతిభ జూనియర్ కళాశాల నిర్వాహకుడు మహేందర్ దాదాపు 60 మందిని నమ్మించి సుమారు రూ.7 నుంచి రూ.8 కోట్ల వరకు అప్పులు చేశాడని, తిరిగి ఇస్తానని చెప్పి రాత్రికి రాత్రే కళాశాల, కళాశాల భవనాన్ని అమ్ముకొని పారిపోయాడన్నారు. పై చదువులకు వెళ్లాల్సిన విద్యార్థుల సర్టిఫికెట్స్ కూడా ఇవ్వలేదన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులతో కలిసి డీఐవో దృష్టికి సైతం తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. ఈ క్రమంలో కళాశాల నిర్వాహకుడు మహేందర్.. పట్టణంలోని హిందీ హైస్కూల్ ఎదురుగా ఉన్న బిల్డింగ్‌లోని థర్డ్ ఫ్లోర్‌లో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇస్తున్నామని డీఐవోకు లెటర్ పంపించినట్లు తమకు తెలిసిందని వారు చెప్పారు. విద్యార్థులతో కలిసి అక్కడికి వెళ్లి చూడగా, ఎలాంటి సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదని.. సర్టిఫికెట్స్ కావాలంటే అప్లికేషన్ పెట్టుకోవాలని అక్కడున్న వారు చెప్పడంతో తిరిగివచ్చినట్లు వివరించారు. ఈ క్రమంలో లక్సెట్టిపేటలోని ఓ ప్రైవేట్ కళాశాలకు చెందిన వ్యక్తి విద్యార్థులకు ఫోన్ చేసి.. 'మీ ఇంటికే సర్టిఫికెట్స్ తీసుకువస్తున్నా. సర్టిఫికెట్స్‌కు రూ.6 వేలు, టీసీకి రూ.వెయ్యి సిద్ధం చేసుకొని ఉండండి' అంటూ విద్యార్థులకు ఫోన్ చేసి చెప్పినట్లు బాధితులు తెలిపారు. ఐబీ ఏరియాలోని ఓ విద్యార్థిని ఇంట్లో సర్టిఫికెట్లు ఇస్తున్న క్రమంలో అక్కడికి చేరుకున్నామని, కళాశాలలో ఇవ్వాల్సిన సర్టిఫికెట్లు మీ చేతుల్లో ఎందుకున్నాయని అక్కడున్న వ్యక్తిని నిలదీశామన్నారు.కాగా, ఈ విషయంపై పట్టణ సీఐ ప్రమోద్ రావుకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.


మంచిర్యాలలో నిర్వహించిన యోగా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న దివాకర్‌రావు

## ఆస్తిపాస్తులకన్నా ఆరోగ్యం మిన్నా

### యోగా దినోత్సవంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, జూన్ 21: ఆస్తిపాస్తులకన్నా ఆరోగ్యం మిన్నా అని, నిత్యం యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా జీవిస్తారని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మంచిర్యాలలోని వైశ్యభవన్‌లో స్వామి వివేకానంద యోగ, ఓం అష్టోత్తర యోగా పీఠ్, ఫిట్‌నెస్ సెంటర్, వాసవీక్లబ్ సంయుక్తంగా నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యోగా వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా పలువురు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో యోగా ట్రైనర్‌లు శ్రీనివాసరెడ్డి, కొత్త వేణు, విజయ్, తులా ఆంజనేయులు, దార కుమారస్వామి, శ్రీనాథ్, అనిల్, తిరుపతి యాదవ్, సురేశ్‌గౌడ్ పాల్గొన్నారు.


సామల సదాశివ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

## సామల సదాశివ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఆర్ఎస్పీ

భీమిని, జూన్ 21 : చిన్నగుడిపేట గ్రామంలో శనివారం సామల సదాశివ విగ్రహాన్ని డాక్టర్ ఆర్ఎస్‌ప్రవీణ్‌కుమార్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సదాశివ తెలుగు సాహిత్యానికి, సంస్కృతికి చేసిన సేవలు గొప్పవని కొనియాడారు. ఆయన రచనలు, అనువాదాలు, పరిశోధనలు తెలుగు భాషకు ఎనలేని గౌరవాన్ని తెచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నిరంజన్ గుప్తా, మాజీ సర్పంచు రమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.